పువ్వుల్నే గాని ముళ్ళని చూడ్డు. సహనం అతడి సహచారిణి. అందుకే అతడు అలా అలా బతుకు తున్నాడు. - నవ్వ లేక ఏడుస్తూ - ఏడ్వ లేక నవ్వుతూ.

* * *

చిట్టి బాబు తెల్లగా, సన్నంగా, పొడుగ్గా, అందంగా వుంటాడు. అతడు చురుకైన వాడు. జీవితం జీవించడం కోసమే గాదనీ, అది సమాజానికి వుపయోగపడాలనీ, ఆశించాడు. వినయంగా విధేయతగా, వుండేవాడు. కష్టపడి చదివే వాడు.

* * *

అలాంటి చిట్టిబాబు, ఎమ్మే పాసయ్యాడు. ఫస్టు రాంక్ తెచ్చుకున్నాడు.

'నేను ఏనాడో చావాల్సింది! నువ్వు నీ కాళ్లమీద నిలబడ్డాకే చావాలనీ, ఎగిరి పోతున్న ప్రాణాన్ని పట్టుకు బతుకుతున్నాను. నేనింక బతకను!' అని చెప్పి , మరీ చచ్చి పోయాడు చిట్టిబాబు తండ్రి.

తల్లిని, పెళ్లికి సిద్ధంగా వున్న చెల్లెల్ని , చదువుకుంటున్న తమ్ముణ్ణీ, పోషించవల్సిన బాధ్యత - చిట్టిబాబు మీద పడింది. ఆస్తి పాస్తు లేవీ లేక పోడంచేత, రోజులు గడవడం కష్టమవుతోంది. అప్పుడతడు చిట్టి గుమస్తాగా జీవితం ప్రారంభించాడు. అతడు పొడవైన , పొట్టి గుమాస్తాగా, బతకడం మెదలెట్టాడు.

ఒక వయస్సులో పురుషుడికి, స్త్రీ అత్యంత ముఖ్యం. పురుషులు స్త్రీలను కామిస్తారు. అంచాత స్త్రీ కోసం కొందరు ప్రేమిస్తారు. కొందరు, త్యాగాలు చేస్తారు. కొందరు బేరాలే చేస్తారు. అలా చేయలేని వాళ్లు, దుకాణాల్లో స్త్రీ సుఖం కొనుక్కుంటారు.

అయితే - చిట్టిబాబు, చెల్లిలికి పెళ్లి చేయాలి. ఆ విషయంలో - చిట్టి బాబుకి, తల్లి పోరు తట్టుకోడం కష్టంగా వుంది. అంచాత, ఒక బేరం కుదుర్చు కున్నాడు. ఆ బేరంతో చెల్లెలి పెళ్లి అయ్యింది. .అలాగే, చిట్టి బాబు పెళ్లి కూడా అయిపోయింది.

* * *

చిట్టి బాబు భార్య బియ్యే పాసయింది. ఆమె నిల్చున్నప్పుడు, సన్నజాజి పందిరిలా గాకుండా, సన్నని లత లావుంటుంది. ఆమె నీడలా నల్లగా వుంటుంది. ఆమె నవ్వి నప్పుడు, మల్లెలు నవ్వినట్లు ముచ్చటగా వుంటుంది.

ఆమె చిట్టిబాబుతో జీవితం తియ్యగా గడుపుతూంది.

* * *

పెళ్లి చేసుకున్న చిట్టిబాబు, నలుగురి పిల్లల్ని కన్నాడు. కుటుంబ భారం పెరిగి పోయిన చిట్టిబాబుకి జీవితం భారంగా, దుర్భరంగా వుంది. అతడిప్పుడు, అరువు బట్టల షాపు ముందున్న మెయిన్ రోడ్డు మీద వెళ్లడు.

అరువు కిరాణా కొట్టు ముందున్న రోడ్డు మీద నడవడు.

జీతాల రోజున లీవులో వుంటాడు. లేదా, అర్ధ రాత్రి వరకూ, ఆఫీసులో వుండి, బితుకు బితుకుగా, ఇల్లు చేర్తాడు. కాబులీ వాళ్ల నుండి తప్పించుకోడానికి అలాంటి స్ట్రాటజీ ఫాలో అవుతాడు.

చిట్టిబాబు నిరపరాధి. అయినా, అపరాధిలా వుంటాడు.

చిట్టిబాబుకి సాగరం అంటే అసహ్యం. ఎందుకంటే, సంసారం సాగరం కావడమే! చిట్టిబాబుకి మల్లె పూలు కొనే మొగాళ్లంటే మంట. ఎందుకంటే, అతడెప్పుడూ మల్లె పూలు కొనడు గాక కొనడు.

వెన్నెలంటే అతడికి, చీకటి చీకటిగా వుంటుంది. ఎందుకంటే జీవితంలో చీకట్లు అతణ్ణి వెన్నెల్ని చూడనీవు!

లేచి పడే కడలి తరంగాలు - విరజాజుల వూసులూ - లేత పెదవుల సంగీతపు పరవళ్లూ - లతల నృత్యాలూ - లలిత సంగీతాలు - కవితా సౌరభాలు - వెన్నెల గానాలూ - ఎవరెవరికో ఆనందంగా, శృంగారంగా వున్నా, చిట్టిబాబుకి అవి విషాదంగానే వున్నాయ్!

* * *

ఆ కుర్ర కుక్కకి లోకంలో దుఃఖం వుందని తెలీదు. ఆర్తి వుందని తెలీదు. ఆకలి వుందని తెలీదు. హింస వుందని తెలీదు. అంచాత ఆనందంగా, వైభవంగా బతుకుతోంది.

అయితే - మనుషుల్లో కుక్క వెధవలున్నారని తెల్సు కున్నట్లు - ఆ కుక్క - గర్వంగా - గొప్పగా వుంటుంది!

కడుపు కోసం కాలు అమ్ముకునే కల కంఠుల్ని, 'బిచెస్' అని రిఫర్ చేస్తారని తెల్సుకున్నట్లు- ఆ కుక్క అప్పుడప్పుడు విచారంగా వుంటుంది! ఆ 'బిచెస్' ని కటువుగా, కుక్కల్లా కరిచే, కామోద్రేకులున్నారని తెల్సుకున్నట్లు, అప్పుడప్పుడది - మరీ మరీ విషాదంగా వుంటుంది!

* * *

ఆ కిందటి రోజునే చిట్టిబాబు ఇంట్లో బియ్యం నిండుకున్నాయ్. ఆ రాత్రి పిల్లలు అర్ధాకలితో పడుకున్నారు. అతడు నిండాకలితో నిద్రపోయాడు. ఆమెకయితే, ఆకలి అలవాటయి పోయింది. ఆమెకు ఓర్మి విందు భోజనం.

మర్నాడు ఉదయం అతడు ఆరు గంటలకే ఇంటి నుండి బయలు దేరాడు. అప్పుకోసం ఆప్త మిత్రుని ఇంటికి వెళ్లేడు. అర గంట మాట్లాడేడు. చెప్పలేక - చెప్పలేక, నవ్వుతూ - నవ్వుతూ, సిగ్గు పడుతూ - సిగ్గు పడుతూ, వచ్చిన పని చెప్పాడు. అతడు రెండు అయిదులు, మడతపెట్టి చేతిలో పెట్టాడు.

'మనవంతా ఒహటే! ఒకలాగే వున్నాం ! మన దేశంలో అతి పెద్ద భాగం అలాగే వుంది! ఒకలాగే వుంది!' అని చల్లగా చెప్పి, షేక్ హాండ్ ఇచ్చి, చిరునవ్వు నవ్వి, చిట్టిబాబుని సాగనంపేడు.

అతడు వడి, వడిగా ఇంటికి వెళ్తున్నాడు. ఆ రోడ్డు మళ్లిన వెంటనే, ఏదో పిలుపు విన్నాడు. ' ఆగు బాబూ, ఆగు' అన్న కేక విన్నాడు. వెంటనే ఆగి పోయాడు.

'ఏటి? ఎన్నాలయ్యిందో బట్టలుతికి? డబ్బు ఇవ్వనేదే! పది రూపాయి లియ్యాలి! అరువెట్టేసినావు! మాం ఏందిని బతకాల! గిన్నె పొయ్యెక్కి రెంణ్నాలయింది!' అని పది రూపాయలు ఇస్తావా - నన్ను సవ్వ మాన్నావా అన్నట్లు ఆ చాకల్ది అడిగేసింది.

చిట్టి బాబు వెంటనే అయిదు రూపాయలు ఇచ్చేసాడు. వెనక్కి తిరిగి చూడకుండా, గబగబా వెళ్లి పోయాడు. అరకేజి బియ్యం, అరకేజి వంకాయల్తో ఇల్లు చేరాడు.

' నా ఇంట్లో గిన్నె పొయ్యెక్కి ఒక రోజు అయ్యింది! చాకలి దానింట్లో గిన్నె . పొయ్యెక్కి రెండ్రోజులయ్యింది! అవునవును !' అని అనుకుంటూ, అతడు ఇంట్లో అడుగు పెట్టాడు.

అంతలో ఆఫీసు టయిమయి పోయింది. అంచాత, మంచినీళ్లు తాగి, భోజనానికి మళ్లీ వస్తానని చెప్పి, అతడు ఆఫీసుకి వెళ్లి పోయాడు

ఆమె అన్నం వండి, పిల్లలికి పెట్టింది. మిగిలిన వంట మూత పెట్టి, వుంచింది.

భర్త కోసం ఎదురు చూస్తూ, కూర్చుంది.

ఆమె మోకాళ్ల మీద బుర్ర పెట్టి, నేలలోకి చూస్తూ, అలోచిస్తూ కూర్చుంది.

అప్పుడామె, క్షీణించి పోతున్న మల్లె పాదలా వుంది.

అంతలో అ కుర్ర కుక్క, గబగబా వచ్చింది. నోటితో ఒక చీటిని పట్టుకొచ్చి, ఆమెకు ఇచ్చింది.

ఆమె ఆ చీటీని తీసుకుని, చదివింది. ' ఈ నెల అద్దె ఇంకా ఇవ్వలేదు! వెంటనే పంపండి' అని రాసి వుంది. ఆ రాత కింద , అ కుర్ర యజమానురాలి సంతకం వుంది.

ఆమె ఆ చీటీ చదువు తున్నప్పుడు, ఆ కుర్రకుక్క, వంట గిన్నెల్ని తోసేసింది. అ వంటను ముట్టుకుంది. వాసన చూసింది.

'అద్దె నా కిస్తావా?' అన్నట్లు ఆమె మొహం లోకి, ఒక సారి సూటిగా చూసి, వెళ్లిపోయింది.

ఆ గిన్నెల చప్పుడు, ఆమె వింది. ఆమె గుండెల చప్పుడు ఎక్కువయ్యింది.

'కుక్క కూడే గాకుండా, కుక్క ముట్టిన కూడు కూడా, తినాల్సిన రోజులొచ్చాయ్,!' అని ఆమె నెత్తీ - నోరూ మొత్తుకుంది.

* * *

ఆమె మోకాళ్ల మీద బుర్ర పెట్టుకుని, నేల లోకి చూస్తోంది. అలోచిస్తూ, విచారిస్తోంది. అప్పుడామె - క్షీణించి, చెదిరి పోయిన, మల్లె పాదలా వుంది.

'మనలో నీతి వుంది. నిజాయితీ వుంది. న్యాయం వుంది. ఓర్మి వుంది. సహనం వుంది.

శ్రమ వుంది. అహింస వుంది. అలాగే, చదువుంది. సంస్కృతి వుంది. సంస్కారం వుంది. కవిత్వం వుంది. కళ వుంది.

ఇవన్నీ వున్నా, మన బతుకు లెందుకిలా వున్నాయ్, : మనది దేశంలో అతి పెద్ద భాగం అయినా ఎందు కిలా బతుకుతున్నాం?

మన కంటే కూడా అణిగిపోయి, మనకంటే కూడా హీనంగా బతుకుతున్న, మరో పెద్ద భాగం కూడా వుంది?! ఎంచాత?! ఎంచాత?! ' అని ఆమె ఆలోచిస్తూ , తల పైకెత్తింది.

* * *

ఆ వేళప్పుడు, ఆ కుర్ర కుక్క కారులోంచి, హుందాగా బయటకు గెంతింది. ఠీవిగా, జోరుగా మీడమీదకి పరుగెత్తింది. వయ్యారంగా గదిలోకి వెళ్లింది. శృంగారంగా, మెత్తని పరుపు లున్న పట్టె మంచం ఎక్కింది. సిల్కు కర్టెన్లలో బుర్ర పెట్టి, కిటికీ లోంచి , విలాసంగా, పైకి చూసి, కిందికి కూడా, చూసింది.

ఆలోచిస్తూ, తల పై కెత్తి, ఆమె ఆ కుర్ర కుక్కను చూసింది.

(ఆంధ్ర జ్యోతి - సచిత్ర వార పత్రిక – 12-03-1971 )